సాక్షి అనంతపురం

గురువారం । 29 । మే । 2025



చీనీ టన్ను రూ.33,770

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33,770 పలికాయి.



మీ సమస్య పరిష్కారమైందా?

'హలో... కలెక్టర్‌ను మాట్లాడుతున్నా. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మీరిచ్చిన అర్జీ పరిష్కారమైందా..' అంటూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఆరా తీశారు.

8లో

గరిష్టం/కనిష్టం

31.6°/23.1°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బీ ఫార్మసీ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న జేఎన్‌టీయూ అధికారులు

అనంతపురం: బీఫార్మసీ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఏప్రిల్, మే నెలలో నిర్వహించిన బీ ఫార్మసీ నాలుగో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ, ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ (ఆర్–21) సప్లిమెంటరీ ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి. నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ (ఏ) వెబ్‌సైట్ చూడాలని కోరారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ జి. శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ ఎం. అంకారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారుల 'మహా' భక్తి

- టీడీపీ మహానాడుకు 240 బస్సులు
- ఇక్కట్లు పడ్డ ప్రయాణికులు

అనంతపురం క్రైం: ఆర్టీసీ అధికారులు 'మహా' భక్తిని చాటుకున్నారు. కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడుకు బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు ఆదేశించడమే తడువుగా వందల బస్సులు ఏర్పాటు చేశారు. ఒక్క అనంతపురం రీజియన్ పరిధిలోనే 194 బస్సులు దారి మళ్లించారు. అనంతపురం డిపో నుంచి 54 బస్సులు, గుత్తి డిపో నుంచి 10, గుంతకల్లు డిపో నుంచి 30, కళ్యాణదుర్గం డిపో నుంచి 20, రాయదుర్గం డిపో నుంచి 15, తాడిపత్రి డిపో నుంచి 45, ఉరవకొండ డిపో నుంచి 20 బస్సులను పంపారు. వెనకాముందు ఆలోచించకుండా అప్పటికే బుక్కయిన బస్సులను సైతం దారి మళ్లించడంతో వందల మంది ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మరోవైపు సాధారణ ప్రయాణికుల రాకపోకలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇష్టారాజ్యంగా వాహనాలను వినియోగించుకోవడంపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముందస్తుగా సమాచారాన్ని చేరవేయకుండానే అప్పటికప్పుడు బస్సులను రద్దు చేస్తూ బాధ్యతా రాహిత్యంతో వ్యవహరించిన ఆర్టీసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాలలోని ఆరు విభాగాలకు ఎన్‌బీఏ (నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు దక్కింది. సివిల్, కెమికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్సెస్ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించింది. అక్రిడిటేషన్ రావడానికి తోడ్పాటు అందించిన విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బందికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి అభినందనలు తెలిపారు. ఎన్‌బీఏ గుర్తింపు గల కళాశాల జారీ చేసే సర్టిఫికెట్‌కు విలువ అధికంగా ఉంటుంది. నాణ్యతా ప్రమాణాలకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్ నిదర్శనంగా నిలుస్తుంది.

పల్లె పాలనకు చిల్లు

సచివాలయం.. చంద్రగ్రహణం



కూటమి ప్రభుత్వంలో పల్లె కన్నీరు పెడుతోంది. నిర్వీర్యమైన సచివాలయ వ్యవస్థను చూసి బావురుమంటోంది. కాళ్లు కదపకుండానే ఇంటి ముంగిట్లోనే సకల సేవలు పొందిన జనం.. ఇప్పుడు ప్రతి అవసరానికి మండల, డివిజన్, జిల్లా కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ఇదేం పాలన అంటూ ప్రశ్నిస్తున్నారు.

- కూటమి ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ అస్తవ్యస్తం
- రేషనలైజేషన్, సచివాలయాల కుదింపుతో ఉద్యోగుల్లో గందరగోళం
- సంక్షేమ పథకాలకు దూరంగా బడుగు, బలహీన వర్గాల ప్రజలు

అనంతపురం సిటీ: గ్రామ స్వరాజ్యం సాధించుకున్నప్పుడే దేశానికి అసలైన స్వాతంత్య్రం వచ్చినట్లని చెప్పిన గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం జగన్ చొరవతో గ్రామ, వార్డు సచివాలయాలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 469 సచివాలయాల నిర్మాణానికి రూ.187.53 కోట్లు కేటాయించింది అప్పటి ప్రభుత్వం. ఇప్పటి వరకు 349 సచివాలయాలు పూర్తవగా రూ.140.29 కోట్ల బిల్లులు చెల్లించేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500 రకాల సేవల్ని ప్రజలకు అందించారు. ఏదైనా ప్రభుత్వ సేవ పొందాలంటే ఒకప్పుడు మండలం, డివిజన్, జిల్లా కేంద్రాలకు పరుగెత్తే ప్రజలు.. తమ ఊళ్లోనే.. ఇంటి వద్ద ఉంటూనే అనేక సేవల్ని ఉచితంగా పొందారు. దీంతో ప్రజలు తమ విలువైన సమయాన్ని, సొమ్మును ఆదా చేసుకోగలిగారు. పింఛన్ నుంచి ఇంటి పట్టాల వరకు.. పథకం ఏదైనా సరే అర్హత ఉంటే చాలు ప్రజలకు అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకురావడంలో గ్రామ, వార్డు సచివాలయాలు కీలక పాత్ర పోషించాయి. ముఖ్యంగా కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రాణాలకు తెగించి అందించిన సేవలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. అవినీతి, వివక్షకు తావు లేకుండా ప్రజలకు మెరుగైన పాలన అందించిన సచివాలయ వ్యవస్థ.. లక్షలాది మంది నిరుద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చింది.

అనాలోచిత నిర్ణయాలతో..

ప్రజలకు తామున్న గ్రామంలోనే సకల సేవలందించే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోంది. సచివాలయాల కుదింపునకు చర్యలు తీసుకుంటోంది. సగానికి సగం సచివాలయాలను తగ్గించి అక్కడి ఉద్యోగులను సర్దుబాటు చేయాలని సంకల్పించింది. రేషనలైజేషన్ పేరుతో ఉద్యోగుల్లో గందరగోళం సృష్టిస్తోంది.

రైతు భరోసా కేంద్రాలకు గ్రహణం..

ఏడాది కిందటి వరకు ఓ వెలుగు వెలిగిన రైతు భరోసా కేంద్రాలు.. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సేవా కేంద్రాలుగా మారిపోయాయి. ఒక్కో రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి రూ.23.94 లక్షల చొప్పున జిల్లా వ్యాప్తంగా మొత్తం 411 రైతు భరోసా కేంద్రాలను మంజూరు చేస్తూ.. రూ.85.51 కోట్లు కేటాయించింది. అందులో 107 కేంద్రాలు ఇంకా వివిధ దశల్లో ఆగిపోయాయి. పూర్తయిన 304 రైతు భరోసా కేంద్రాల కోసం రూ.57.17 కోట్లు ఖర్చు పెట్టారు. వ్యవసాయాన్ని పండుగలా చేసేందుకు సీఎం జగన్ చేపట్టిన రైతు భరోసా కేంద్రాలు సత్ఫలితాలనిచ్చాయి. సేద్యం దండగ కాదని నిరూపిస్తూ పొలమే ప్రయోగ శాలగా.. రైతులే శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే విజ్ఞాన కేంద్రాలుగా డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలకు అప్పట్లో శ్రీకారం చుట్టారు. విత్తన పంపిణీ నుంచి విక్రయం దాకా అన్ని సేవలను రైతుల ముంగిటకే తెచ్చి రైతు బాంధవుడిగా వైఎస్ జగన్ రైతుల గుండెల్లో నిలిచిపోయారు. ముఖ్యంగా వీటి ఉద్దేశం ఏమిటంటే.. వాతావరణంలో వస్తున్న మార్పులపై ఇప్పటికీ చాలా మంది రైతులకు సరైన అవగాహన లేదు. వంశపారంపర్యంగా వస్తున్న పంటల సాగును కొనసాగించడం మినహా ప్రత్యేక శిక్షణ కూడా లేదు. దీంతో తరచూ నష్టాలు చవి చూడాల్సి వచ్చేది. ఈ క్రమంలో వాతావరణంతో పాటు వ్యవసాయ రంగంలో వచ్చిన, వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు రైతుల్లో చైతన్యం తీసుకువచ్చి, వ్యవసాయాన్ని లాభాల బాటలో నడిపించడమే లక్ష్యంగా అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ వ్యవస్థను తెచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం పుణ్యమా అని రైతు భరోసా కేంద్రాలకు గ్రహణం పట్టింది.

పని భారంతో సతమతం

గత ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా 11 వేల మంది వలంటీర్లు పని చేసే వారు. క్షేత్రస్థాయిలో వీరు అందించిన సేవలు ఎనలేనివి. కూటమి ప్రభుత్వం వచ్చాక.. వలంటీర్లను తొలగించింది. ఫలితంగా వారు చేసే పనంతా ఇప్పుడు సచివాలయ ఉద్యోగులపై పడింది. రకరకాల సర్వేల పేరుతో కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి పెంచింది. కొందరు చేయలేక ఇతర ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వెతుక్కోగా, మెజారిటీ శాతం మంది సచివాలయాల్లోనే కొనసాగుతున్నారు. జాబ్ చార్ట్‌కు, తాము చేసే పనికి సంబంధం లేకుండా ఉంటోందని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో మొత్తం సచివాలయాలు	663
గ్రామ సచివాలయాలు	483
వార్డు సచివాలయాలు	180
గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు	5,547
గ్రామ సచివాలయ ఉద్యోగులు	4,054
వార్డు సచివాలయాల ఉద్యోగులు	1493

సేవలందడం లేదు



కూటమి ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. కొందరు అవినీతికి పాల్పడుతున్నారు. ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలందడం లేదు.

– మండోజీ బాబాఖాన్, అరవిందనగర్, అనంతపురం

సలహాలు ఇచ్చే వారేరీ?



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పి, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే ఏర్పాట్లు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఆర్‌బీకేలు అంతగా పని చేయడం లేదు. సిబ్బంది కూడా కనిపించడం లేదు.

– నాగమణి, మహిళా రైతు, కొడిమి గ్రామం

చాలా కష్టంగా ఉంది



గతంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు, ఇతర సేవలు అందించే వారు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా సంతకాలు చేయించి తెచ్చిచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఇప్పుడున్న ప్రభుత్వం వలంటీర్లను తీసేసింది. చానా కష్టంగా ఉంది.

– శీనా నాయక్, ఎన్‌ఎస్‌పీ తండా, వజ్రకరూరు మండలం

ఆర్బీకేలు నిర్వీర్యమయ్యాయి



ఎన్నికల సమయంలో రైతులకు ఏవేవో హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు పొడిచారు. రైతు భరోసా కేంద్రాల్లో గతంలో చాలా సేవలందించేవారు. ప్రస్తుతం అవి నిర్వీర్యం అయిపోయాయి.

–ఆంజినేయులు, రైతు, సింగానహళ్లి గ్రామం, బొమ్మనహాళ్ మండలం

బదిలీ దరఖాస్తులు @ 9,783

- టీచర్ల బదిలీ ప్రక్రియ వేగవంతం
- హెచ్‌ఎంల వెబ్ ఆప్షన్లు పూర్తి. బదిలీల ఉత్తర్వుల విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల బదిలీ ప్రక్రియ వేగం పుంజుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హెచ్‌ఎంలు మొదలు అన్ని కేడర్ల టీచర్లు 14,784 మంది పని చేస్తున్నారు. వీరిలో 375 మంది హెచ్‌ఎంలు, 329 మంది పీఎస్‌హెచ్‌ఎంలు, 6,850 మంది స్కూల్ అసిస్టెంట్లు, 7,230 మంది ఎస్జీటీలు ఉన్నారు. 'టీచర్ల బదిలీ చట్టం–2025'లో భాగంగా అన్ని కేడర్ల టీచర్లు మొత్తం 9,783 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తప్పనిసరి బదిలీలు 6,060 మంది, రిక్వెస్ట్ బదిలీలకు 3,723 మంది దరఖాస్తు చేసుకున్నారు.

హెచ్‌ఎంలు 191 మంది దరఖాస్తు..

మొత్తం 191 మంది ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 28 మంది తప్పనిసరి బదిలీలు కాగా, 163 మంది రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే పీఎస్‌హెచ్‌ఎంలకు 208 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 33 మంది తప్పనిసరి, 175 మంది రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. స్కూల్ అసిస్టెంట్లకు (లాంగ్వేజెస్) సంబంధించి 1,652 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 957 మంది తప్పనిసరి, 695 మంది రిక్వెస్ట్, స్కూల్ అసిస్టెంట్ల (నాన్ లాంగ్వేజెస్)కు సంబంధించి 2,935 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 1,879 మంది తప్పనిసరి బదిలీలు, 1,056 మంది రిక్వెస్ట్, ఎస్జీటీలకు సంబంధించి 4,642 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 3,088 మంది తప్పనిసరి, 1,554 మంది రిక్వెస్ట్, పీఈటీలకు సంబంధించి 38 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 20 మంది తప్పనిసరి, 18 మంది రిక్వెస్ట్, లాంగ్వేజ్ పండిట్లకు సంబంధించి 117 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 55 మంది తప్పనిసరి, 62 మంది రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.

ఖాళీల మొత్తం 7,912

ఏడు రకాల ఖాళీలు మొత్తం 7,912 ఉన్నట్లు గుర్తించారు. వీటిలో హెచ్‌ఎం పోస్టులు 178, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 3,554, పీఎస్‌హెచ్‌ఎం 714, ఎస్జీటీ కేడర్‌లో 3,466 ఖాళీలున్నట్లు లెక్కలు తేల్చారు.

హెచ్‌ఎం వెబ్‌ఆప్షన్లు పూర్తి... ఉత్తర్వులు సిద్ధం

హెచ్‌ఎం దరఖాస్తుల వెరిఫికేషన్లు పూర్తయి వెబ్ ఆప్షన్లు బుధవారం నాటికి పూర్తయ్యాయి. అర్ధరాత్రి తర్వాత బదిలీ ఉత్తర్వులు జనరేట్ అవుతాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. అలాగే స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి తాత్కాలిక సీనియార్టీ జాబితా విడుదలయింది. దీనిపై గురువారం అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అలాగే ఎస్జీటీలకు సంబంధించి దరఖాస్తుల ఆన్‌లైన్ పరిశీలన ప్రక్రియ పూర్తయింది.

230 పోయి 19 పోస్టులు మిగిలాయి!



ఆందోళన చేస్తున్న టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పదోన్నతుల టీచర్లకు తీరని అన్యాయం చేశారంటూ టీచర్లు వాపోయారు. 117 జీఓ ఆధారంగా వచ్చిన 230 ఇంగ్లిష్ పదోన్నతుల పోస్టులు ఇప్పుడు కేవలం 19 మాత్రమే మిగులుగా చూపిస్తున్నారంటూ మండిపడ్డారు. బుధవారం స్థానిక శారదా నగరపాలక ఉన్నత పాఠశాలలో నిరసన తెలియజేశారు. విద్యాశాఖ అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డీఈఓ చాంబరును ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే రెండేళ్ల సర్వీస్ కోల్పోయి నష్టపోయామని, 27 సంవత్సరాల సర్వీస్ కలిగి ఉండి ఒక్క ప్రమోషన్ కూడా లేకుండానే రిటైర్డ్ అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డీఈఓ ప్రసాద్ బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు జి.సూర్యుడు, రామాంజినేయులు, చంద్రశేఖర్, శ్రీనివాస నాయక్, జయరాం నాయక్, గోపాల్ రెడ్డి, శంకరమూర్తి, కేశవరెడ్డి, ఓబులేసు, లక్ష్మీనారాయణ, ధనలక్ష్మి, విజయ శ్రీ, నరసింహులు, ఓబిరెడ్డి, సూర్యనారాయణ, రసూల్ పాల్గొన్నారు. వీరికి వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఎస్.నాగిరెడ్డి, జి.శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి రవీంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిలర్ గోపాల్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ మద్దతు తెలిపారు.

అవస్థల ఆధార్...

ఆధార్‌లో మార్పుచేర్పుల కోసం అనంతపురం హెడ్ పోస్టాఫీస్ వద్ద బారులుతీరిన ప్రజలు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పథకానికి ఆధార్ తప్పనిసరి చేశాయి. ఆధార్‌కార్డులో చిన్న తప్పు ఉన్నా తీసుకోవడం లేదు. పిల్లల కార్డులు అప్‌డేట్ కాకపోయినా అదే పరిస్థితి. దీంతో ఆధార్‌కార్డుల్లో అప్‌డేట్ కోసం అనంతపురం పోస్టాఫీసుకు నిత్యం జనం క్యూ కడుతున్నారు. వేకువజామునే చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు బారులు తీరుతున్నారు. ఈ క్రమంలో వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఆధార్ సెంటర్లు పరిమితంగా ఉండటం సమస్యగా మారింది. సెంటర్లు పెంచకపోతే పనులు వదిలిపెట్టి తిరగాల్సిన దుస్థితి ఉంటుందని బాధితులు వాపోతున్నారు. – అనంతపురం సిటీ/ సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



10 టోకెన్లు కావాలంటూ డైరెక్ట్‌గా వచ్చిన కానిస్టేబుల్‌కు లైన్‌లో రావాలని చెబుతున్న సిబ్బంది



చంటిబిడ్డల్ని ఎత్తుకుని క్యూలో నిల్చున్న మహిళలు

అది.. నయవంచననాడు

- వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ ధ్వజం



మాట్లాడుతున్న రమేష్‌గౌడ్

అనంతపురం కార్పొరేషన్: 'ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను వంచించారు. అయినా ఏదో చేసినట్లు మహానాడు అంటూ ఆర్భాటం చేస్తు న్నారు. వాస్తవంగా కడపలో జరిగింది టీడీపీ మహానాడు కాదు. నయవంచన నాడు' అంటూ వైఎస్సార్ సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్ ధ్వజమెత్తారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని రెడ్‌బుక్ పేరుతో దౌర్జన్యాలు, దాడులు, అక్రమ అరెస్టులు మినహా రాష్ట్రాభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించలేదని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై కడప మహానాడులో మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా ఏ ఒక్కరూ నోరు విప్పకపోవడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకునే సీఎం చంద్రబాబు అండ్ కో తిరుమల లడ్డు, విజయవాడ వరదలు, అసెంబ్లీ సమావేశాల వివాదాలకు తెర తీశారన్నారు. ప్రత్యేక హెలికాప్టర్లతో టూర్లకే సీఎం చంద్రబాబు పరిమితమవుతూ రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేస్తుంటే, ఆయన కుమారుడు మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్ అంటూ ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్‌తో పాటు 175 హామీలు గుప్పించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేష్.. ఏడాది పాలనలో కనీసం ఒక్క రోజు కూడా వాటిపై మాట్లాడలేదన్నారు. రాష్ట్రంలో మహిళలపై పోలీసులే అనుచితంగా ప్రవర్తిస్తుంటే డిప్యూటీ సీఎం పవన్ కళ్లప్పగించుకుని చూస్తున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ విప్లవాన్ని తీసుకువచ్చి బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. పేదరికాన్ని నిర్మూలించడానికి విద్య ఒక్కటే మార్గమని, కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందించడంతో పాటు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారన్నారు. ఉద్దానంలో కిడ్నీ బాధితుల కోసం రూ.700 కోట్ల నిధులు వెచ్చించి మంచినీరు అందించడంతో పాటు రీసెర్చ్ సెంటర్లను ఏర్పాటు చేశారన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఇలాంటి ఆలోచన ఎన్నడూ చేయలేదని, అమరావతి పేరిట రూ.1,31,000 కోట్ల అప్పుల భారాన్ని మోపారన్నారు. ఇప్పటికే విద్యుత్, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచి ప్రజల నడ్డివిరిచారన్నారు. ఇప్పటికైనా మేల్కొనకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధిచెబుతామని హెచ్చరించారు. సమావేశంలో రజక కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీసాల రంగన్న, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, నరసింహులు, నాయకులు పుల్లయ్య, లబ్బే రాఘవ, రాజునాయక్, నరేంద్ర, హేమకిరణ్, హిదాయ్‌తుల్లా, బాలాజీ, ఓబుళపతి, దాదు, శేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధినేతతో భేటీ



వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల నిర్వహించిన ఎన్‌ఆర్‌ఐ గ్లోబల్ కనెక్ట్ పర్యటన వివరాలను వివరించారు. అనంతరం ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. గ్లోబల్ కనెక్ట్ పర్యటనలో భాగంగా ప్రవాసాంధ్రులతో సమావేశమై గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న సాగించిన సంక్షేమ పాలన, రాష్ట్రాభివృద్ధిని వివరించామన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

నార్పల: మండలంలోని కర్ణపుడి గ్రామానికి చెందిన రైతు వెంకటప్రసాద్(54) విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. తనకున్న 15 ఎకరాల పొలంలో అరటి పంట సాగు చేసిన ఆయన బుధవారం అరటి చెట్లకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. విద్యుత్ మోటార్ ఆన్ కాకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకెళ్లి పరిశీలించాడు. ఫ్యూజ్ పోయినట్లుగా గుర్తించి, వాటిని తీసి వేస్తుండగా విద్యుత్ షాక్ గురై కుప్పకూలాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే నార్పలలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, వెంకటప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

నాడు రాద్ధాంతం.. నేడు అదే సిద్ధాంతం

- రీ-సర్వేపై అప్పట్లో పచ్చ‘బ్యాచ్’ విష ప్రచారం
- తాజాగా సర్వేకు అప్పటి విధానాలనే అనుసరిస్తున్న కూటమి ప్రభుత్వం
- పైలెట్ ప్రాజెక్టుగా రెండు దశల్లో 62 గ్రామాల్లో సర్వే



రీ సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ (ఫైల్)

అనంతపురం అర్బన్: సమగ్ర భూ సర్వేకు సంబంధించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుసరించిన మార్గమమే ఉత్తమమని కూటమి ప్రభుత్వ చేపట్టిన చర్యలు చెప్పకనే చెబుతున్నాయి. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ బాటను అనుసరిస్తూ భూముల రీ-సర్వే చేపట్టింది. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా చేపట్టిన భూముల రీ సర్వేపై విష ప్రచారం సాగించిన టీడీపీ కూటమి నేతల నోళ్లు ఇప్పుడు మూతపడ్డాయి. దీనికి తోడు భజన పత్రికల చేతులకు బ్రేక్‌లు పడ్డాయి.

గత ప్రభుత్వంలో సర్వే ఇలా

సర్వే క్రమంలో తలెత్తే వివాదాల పరిష్కారానికి ప్రత్యేకంగా మండలానికి ఒక డిప్యూటీ తహసీల్దార్‌ను మొబైల్ మెజిస్ట్రేట్‌గా గత ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇదే పంథాను అనుసరిస్తోంది. జిల్లావ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 31 మండలాల్లో ఉన్న 503 గ్రామాలకు సంబంధించి 25,17,658.52 ఎకరాల రీ సర్వేకు గత ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంది. అన్ని గ్రామాల్లో డ్రోన్ ఫ్లై ఓఆర్‌ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) చిత్రాలను తీశారు. 499 గ్రామాలకు సంబంధించి ఓఆర్‌ఐలు సిద్ధంగా ఉన్నాయి. అదే క్రమంలో 198 గ్రామాల్లోని 5,88,615.626 ఎకరాల సర్వే సంపూర్ణ స్థాయిలో పూర్తి చేశారు. ఈ విధానాలతో సర్వే ప్రక్రియను గత ప్రభుత్వం సులభతరం చేసింది. దీంతో తాజాగా మిగిలిన 305 గ్రామాల్లో ఎలాంటి అడ్డంకులూ లేకుండా రీ-సర్వేకు అధికారులు సమాయత్తమయ్యారు. ప్రస్తుతం రెండు దశలుగా 62 గ్రామాల్లో సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నారు. మండలానికి ఒక గ్రామం చొప్పున మొదటి దశలో 31 గ్రామాలు, రెండో దశలో మరో 31 గ్రామాల్లో సర్వే చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

గతంలో పక్కాగా రీ-సర్వే

గత ప్రభుత్వంలో భూముల రీ-సర్వే ప్రక్రియ పక్కాగా జరిగింది. 503 గ్రామాలకు గానూ 198 గ్రామాల పరిధిలోని 1,83,353 భూ కమతాలకు సంబంధించి 5,88,615.626 ఎకరాలు సర్వే చేసి హద్దులు నిర్ధారిస్తూ రాళ్లు కూడా ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. అయితే 1,83,353 భూ కమతాలకు గానూ 5,421 ఫిర్యాదులు (0.03 శాతం) మాత్రమే వచ్చాయి. దీనిని బట్టి చూస్తే సర్వే పక్కగా జరిగినట్లుగా స్పష్టమైంది. దీంతో అప్పట్లో రీ సర్వే ప్రక్రియపై విమర్శలు చేసిన నోళ్లు మూతపడ్డాయి. రీ-సర్వేపై విషం చిమ్ముతూ కథనాలు ప్రచురించిన పత్రికలు సైతం మూగబోయాయి.

భూముల రీ-సర్వే చేయాల్సిన గ్రామాలు **503**

సర్వే చేయాల్సిన మొత్తం విస్తీర్ణం **25,17,658.51** ఎకరాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్వే ఇలా..	
డ్రోన్ సర్వే పూర్తయిన గ్రామాలు	503
ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్‌లు వచ్చిన గ్రామాలు	499
అప్పట్లో వందశాతం సర్వే పూర్తయిన గ్రామాలు	198
సర్వే చేసిన విస్తీర్ణం	5,88,615.626 ఎకరాలు

కూటమి ప్రభుత్వంలో సర్వే ఇలా...	
సర్వే చేయాల్సిన గ్రామాలు	305
ఏడాదిగా సర్వే జరుగుతున్న గ్రామాలు	62

మీ సమస్య పరిష్కారమైందా..?

- అర్జీదారునికి కలెక్టర్ ఫోన్

అనంతపురం అర్బన్: ‘‘హలో... కలెక్టర్‌ను మాట్లాడుతున్నాను. మీరు ఈ ఏడాది మార్చి 7న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చారు. సమస్య పరిష్కారమైందా..’ అంటూ కలెక్టర్ వినోద్ కుమార్ ఆరా తీశారు. బుధవారం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పామిడి మండలం అనుంపల్లి గ్రామానికి చెందిన అర్జీదారునితో కలెక్టర్ మాట్లాడారు. ‘‘అప్పాజీపేట సర్వే నంబరు 178-బీలో ఏడున్నర ఎకరాల్లో తాటిచెట్లు నాటుకుని జీవనం సాగిస్తున్నామని, వాటిని వేరొకరు ఆక్రమించారని అర్జీ ఇచ్చారు. మీ భూమికి పట్టా ఉందా’’ అంటూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్జీదారుడిని అలాగే లైన్‌లో ఉంచి వీఆర్‌ఓ జ్యోతితో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. ‘‘మీకు సమస్యపై అవగాహన ఉందా.. ఏం చర్యలు తీసుకున్నారు..’’ అని ప్రశ్నించారు. ఇందుకు వీఆర్‌ఓ సమాధానమిస్తూ సంబంధిత భూమి వాగు స్థలంలో ఉందని తెలిపారు. ఈ క్రమంలోనే కలెక్టర్.. పామిడి తహసీల్దారుతో ఫోన్‌లో మాట్లాడారు. ‘‘అర్జీ అందిన తరువాత ఎలాంటి చర్యలు తీసుకున్నారు.. వాగు భూమిలో పంట ఎందుకు వేయనిచ్చారు..’’ అంటూ ప్రశ్నించారు. ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోనందున అప్పాజీ పేట వీఆర్‌ఓ జ్యోతికి కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేయాలని తహసీల్దాను ఆదేశించారు. అదే విధంగా పామిడి తహసీల్దారుకు కాషన్ నోటీసు జారీ చేయాలని ఆర్డీఓని ఆదేశించారు. భూమిలో ఇద్దరూ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

యోగా మాసాన్ని విజయవంతం చేద్దాం

అనంతపురం కల్చరల్: యోగా మాసాన్ని విజయవంతం చేద్దామని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. అనంతపురంలోని పాతూరు బ్రహ్మకుమారీ ఈశ్వరీయ ఆశ్రమంలో బుధవారం ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, బ్రహ్మకుమారీల జిల్లా ఇన్‌చార్జి సిస్టర్ శారద తదితరులు యోగా ప్రాముఖ్యతను వివరించారు. సంపూర్ణ ఆరోగ్య రహస్యాలనందించే యోగాను అధికారులు కూడా క్రమం తప్పకుండా చేయాలని అప్పుడే ఒత్తిడి లేని జీవితాన్ని ఆస్వాదించగలరని అన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, డీఆర్డీఏ పీడీ శైలజ, తహసీల్దార్ పుణ్యవతి, ఆయుష్ అధికారి డాక్టర్ రామ్ కుమార్, యోగా గురువులు కృష్ణవేణి, రాజశేఖరరెడ్డి, ఆంజనేయులు, దివాకర్, గురురాజ్, త్యాగరాజ్, గంగాధర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నాణ్యత... దేవుడికెరుక!

- మండలాలకు నాసిరకం విత్తనకాయల సరఫరా
- ప్రమాణాలపై దృష్టి పెట్టని వ్యవసాయశాఖ
- రైతుల ఆశలతో సర్కారు చెలగాటం



నాసిరకం విత్తన వేరుశనగ సరఫరా చేశారని వాపోతున్న కూడేరు మండలం కమ్మూరువాసులు

అనంతపురం అగ్రికల్చర్: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు అన్నదాతల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. రైతు కష్టనష్టాల గురించి అసలు ఆలోచించడమే లేదు. విత్తన వేరుశనగ పంపిణీ ప్రక్రియలో మరోసారి సర్కారు అలసత్వం బయటపడింది. ఈ సారి జిల్లా రైతులకు నాణ్యత లేని విత్తన కాయలు పంపిణీ చేసి ‘మీ చావు మీరు చావండి’ అంటూ చేతులు దులుపుకునే అవకాశం కనిపిస్తోంది. ఖరీఫ్ ప్రారంభమవుతున్న కీలక తరుణంలో అటు టీడీపీ ఎమ్మెల్యేలు ‘మహానాడు’ అంటూ రైతులను గాలికి వదిలేయగా.. ఇటు వ్యవసాయశాఖ అధికారులు బదిలీల మాయలో విత్తన పంపిణీ గురించి పట్టించుకోవడమే లేదు.

ఆర్‌ఎస్‌కేలకు నాసిరకం సరుకు..

ఈ సారి విత్తన పంపిణీ ప్రక్రియను చాలా ఆలస్యంగా ప్రారంభించారు. జిల్లాకు 50,592 క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీసీడ్స్‌కు బడ్జెట్ విడుదల చేయకుండా తీవ్ర జాప్యం చేయడంతో జిల్లాలో రైతులు పండించిన నాణ్యమైన విత్తనం కొనుగోలు చేయలేని దుస్థితి నెలకొంది. దీంతో విత్తనం కోసం మిల్లర్లపై ఆధారపడ్డారు. ఇప్పటికే చాలా ఆలస్యం కావడం, మరోవైపు బదిలీల ప్రక్రియ కొనసాగుతుండటంతో విత్తనశుద్ధి (ప్రాసెసింగ్)పై దృష్టి పెట్టడం లేదు. ఇదే అదునుగా మిల్లర్లు నాసిరకం విత్తనకాయలను మండలాలు, రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే)కు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అనుమతి ఉన్న 10 ప్రాసెసింగ్ ప్లాంట్ల నుంచి 6 వేల క్వింటాళ్ల వరకు ఆర్‌ఎస్‌కేలకు సరఫరా చేశారు. అందులో నాలుగైదు లారీల వరకు వేరుశనగ కాయ నాణ్యత లేదని వెనక్కి వచ్చినట్లు సమాచారం. సాధారణంగా పంపిణీ చివరి సమయంలో నాసిరకం, కల్తీ సరుకు సరఫరా అయ్యేది. కానీ చంద్రబాబు ప్రభుత్వ అలసత్వం కారణంగా నేడు మొదట్లోనే నాసిరకం సరఫరా అవుతుండటం రైతులను కలవరపరుస్తోంది.

దిగుబడులపై తీవ్ర ప్రభావం..

అన్నదాతలకు నాణ్యమైన విత్తనం అందించడంలో వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ విఫలమవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాణ్యతా ప్రమాణాల మేరకు 9 శాతం లోపు తేమశాతం, 70 శాతం మొలకశాతం (జర్మినేషన్), 96 శాతం ఫిజికల్ ప్యూరిటీ, 74 శాతం అవుటన్ (షెల్లింగ్), వ్యర్థ పదార్థాలు (ఇనర్ట్‌మ్యాటర్) 4 శాతం మేర ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ అవుటన్ శాతం చాలా తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అవుటన్ తక్కువగా ఉంటే విత్తనం మొలకెత్తినా దిగుబడులపై ప్రభావం ఉంటుందని చెబుతున్నారు.

అమ్మవారికే ఎగనామం

- ముసలమ్మ ఆలయ స్థలం ఆక్రమణ
- రూ.5 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం

బుక్కరాయసముద్రం: గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండేలా కరుణించిన ముసలమ్మ అమ్మవారికే కబ్జాదారులు ఎగనామం పెట్టారు. రూ.కోట్ల విలువైన ఆలయ భూమిని కబ్జా చేసి, ఆ స్థలంలోకి ఎవరు కాలు పెట్టినా సహించేది లేదంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దౌర్జన్యాలను తాళలేక చివరకు అన్యాక్రాంతమైన భూమిని ఆలయానికి తిరిగి స్వాధీనం చేయాలంటూ అనంతపురం ఆర్డీఓకు ముసలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సుశీల విన్నవించారు.

ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి నాడు ప్రాణత్యాగం

ముసలమ్మ ఆలయానికి సుదీర్ఘ చరిత్రనే ఉంది. మూడు శతాబ్దాల క్రితం బుక్కరాయసముద్రం చెరువు నిండి ఉప్పొంగి కట్టకు భారీగా గండిపడింది. దీంతో చెరువులోని నీరంతా గ్రామంలోకి చొరబడి మునిగిపోతుండగా గ్రామస్తులు గ్రామ సమీపంలో ఉన్న పోలేరమ్మ తల్లిని ప్రార్థించారు. ఆ సమయంలో ‘గ్రామంలో ఉన్న బసిరెడ్డి చిన్నకోడలు ముసలమ్మ ప్రాణత్యాగంతో కట్ట నిలుస్తుంది’ అనే మాటలు వినిపించడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. విషయం తెలుసుకున్న ముసలమ్మ దేవుడిని ప్రార్థిస్తూ గండి పడిన చోట చెరువులోకి దూకింది. దీంతో వరద నీరు నిలిచిపోయిందట. అప్పటి నుంచి ముసలమ్మను ఇలవేల్పుగా గ్రామస్తులు పూజిస్తూ వస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని ఆకాంక్షించి ప్రాణత్యాగం చేసిన ముసలమ్మకు ప్రత్యేకంగా ఆలయాన్ని నిర్మించి నిత్య పూజలు చేస్తూ వస్తున్నారు. అనంతరం కాలంలో రూ.3 కోట్లు వెచ్చించి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

అమ్మోరు స్థలానికే ఎసరు

ముసలమ్మ ఆలయం వెనుక సర్వే నంబర్ 636-4లో 80 సెంట్ల స్థలం బెంగళూరుకు చెందిన ఆదెమ్మ పేరుపై డైక్లాట్‌లో ఉంది.



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న ఆలయ ధర్మకర్త సుశీల

ఈమెకు ఇద్దరు కుమార్తెలు కాగా, పెద్దకుమార్తె మునిరత్నమ్మ పేరుపై 1933లో రిజిస్టర్ చేయించి ఇచ్చింది. ఆ తర్వాత ఆ స్థలాన్ని 1949, ఫిబ్రవరి 10న ముసలమ్మ ఆలయంలో నిత్యకైంకర్యాలు నిర్వహించేందుకు వీలుగా అమ్మవారి వంశస్తులైన తిరుమలరెడ్డి గారి కొండారెడ్డికి దాన విక్రయం కింద మునిరత్నమ్మ రాసిచ్చారు. అప్పటి నుంచి పాత గుడిలో అమ్మవారికి నిత్య పూజలు కొనసాగుతూ వచ్చాయి. కాలక్రమేణ గుడిని అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో 33 సెంట్ల స్థలాన్ని అనంతపురానికి చెందిన వెంకట్రాముడు అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడు. ముసలమ్మ వంశస్తులతోనే ఆ స్థలాన్ని కొనుగోలు చేసినట్లుగా నకిలీ పత్రాలను సృష్టించాడు. ఆ స్థలం తనదని, అక్కడ ఎవరు కాలు పెట్టినా సహించేది లేదంటూ హెచ్చరికలు జారీ చేశాడు. ఇదే విషయంపై రెవెన్యూ అధికారులకు ఆలయ ధర్మకర్త సుశీల, ఆమె భర్త సూర్యనారాయణరెడ్డి, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ కేశవ నాయుడు, తహసీల్దార్ పుణ్యవతిని కలసి ఆలయ భూమిని పరిరక్షించాలంటూ విన్నవించారు. అన్యాక్రాంతమైన భూమి విలువ రూ.5 కోట్లకు పైగా ఉంటుందని, వెంకట్రాముడితో పాటు మరి కొందరు దౌర్జన్యానికి దిగుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు.

జిల్లా కేంద్రానికి దారి చూపండి

- శింగనమల మరువకొమ్మ వద్ద గ్రామస్తుల ధర్నా
- అధికారుల హామీతో ఆందోళన విరమణ



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావు

శింగనమల: నియోజకవర్గ కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి దారి చూపాలంటూ శింగనమల వాసులు బుధవారం పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. దాదాపు 45 నిమిషాల పాటు ‘544డీ’ జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. దీంతో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావు, సీఐ కౌలుట్లయ్య, ఏఎస్‌ఐ చితంబరయ్య అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా శింగనమల నుంచి అనంతపురానికి రాకపోకలు సాగించేందుకు ఏకైక మార్గం మరువకొమ్మ మీదుగానే ఉండేదని గుర్తు చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఈ రహదారిని మూసి వేసి, మరువకొమ్మ నుంచి తాడిపత్రి వైపుగా ఉన్న పెద్దమ్మ గుడి వద్ద క్రాసింగ్ ఇచ్చారన్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు గాయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి నిర్మాణ సమయంలో మరువకొమ్మ క్రాస్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించి ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదన్నారు. ఉద్దేశపూర్వకంగానే శింగనమల నుంచి అనంతపురానికి రాకపోకలు సాగించే మార్గాన్ని మూసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెద్దమ్మ గుడి వద్ద చోటు చేసుకున్న ప్రమాదాల్లో కొందరు మృత్యువాత పడ్డారన్నారు. జాతీయ రహదారి మార్గంలో ఉన్న చిన్నపాటి గ్రామాలైన రెడ్డిపల్లి, రోటరీపురం,కొర్రపాడు వద్ద రెండు బ్రిడ్జిలు, సి.బండమీదపల్లి, పోతురాజుకాల్వ, పెరవలి, నాయనపల్లి క్రాస్‌లో అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించారని, అయితే నియోజకవర్గ కేంద్రమైన శింగనమలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారంటూ అసహనం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకూ ఆందోళనను విరమించబోమని భీష్మించారు. సీఐ కౌలుట్లయ్య, డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావు మాట్లాడుతూ.. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటామని భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు.

కలకలం రేపిన చిన్నారుల అదృశ్యం

- డోన్‌లో గుర్తించి ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు
- తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగింత

అనంతపురం: జిల్లా కేంద్రంలో ముగ్గురు చిన్నారుల అదృశ్యం కలకలం రేపింది. ఒకే ఇంట్లో ఇద్దరు, పొరుగింటి చిన్నారి ఒకరు మొత్తం ముగ్గురు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు కంగారు పడ్డారు. వివరాలు.. అనంతపురంలోని రామచంద్ర నగర్‌లో నివాసముంటున్న వ్యక్తి పల్లెల్లో తిరుగుతూ వన్‌గ్రామ్, రోల్డ్‌గోల్డ్ నగల విక్రయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని భార్య స్థానిక షిర్డీనగర్‌లో ప్లాస్టిక్ ఫ్లవర్ షాపు ఏర్పాటు చేసుకుని కుటుంబానికి చేదోడుగా నిలిచింది. వీరికి 12 ఏళ్ల వయసున్న కుమార్తె, 8 ఏళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. వేసవి సెలవులు కావడంతో ఇంటి పట్టునే పిల్లలు ఉంటూ ఆడుకునేవారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 6 గంటలకు తండ్రి వ్యాపారం నిమిత్తం పల్లెలకు వెళ్లిపోయాడు. ఉదయం 8:15 గంటలకు తల్లి కూడా దుకాణానికి వెళ్లిపోయింది. ఉదయం 9:30 గంటలకు తండ్రి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే పిల్లలిద్దరూ కనిపించకపోవడంతో చుట్టుపక్కల ఆరా తీశాడు. వారితో పాటు ఆడుకుంటున్న పక్కింట్లో నివాముంటున్న వారి 8 ఏళ్ల వయసున్న కుమార్తె కూడా కనిపించకపోవడంతో ఇరు కుటుంబాల్లోనూ ఆందోళన వ్యక్తమైంది. చుట్టుపక్కల కాలనీలు గాలించారు. బస్టాండు, రైల్వేస్టేషన్లు జల్లెడ పట్టారు. స్నేహితులు... బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డోన్‌లో ఆచూకీ : చిన్నారుల అదృశ్యమైన అంశాన్ని సీఐ కె.శాంతిలాల్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు వేగవంతం చేశారు. చిన్నారుల స్నేహితులను ఆరా తీశారు. తమ సొంతూరు డోన్‌కు వెళుతున్నట్లుగా అక్క, తమ్ముడు తెలిపారని స్నేహితులు వివరించడంతో రామచంద్రనగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రతి సీసీ కెమెరా ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కతమ్ముడితో పాటు పక్కింటికి చెందిన అమ్మాయి కూడా ఫుటేజీల్లో కనిపించడంతో తల్లిదండ్రులతో పాటు పోలీసులూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం రామచంద్రనగర్ నుంచి చంద్ర ఆస్పత్రి సర్కిల్ మీదుగా గుత్తి రోడ్డుకు చేరుకున్న చిన్నారులు అక్కడ బస్సు ఎక్కినట్లుగా గుర్తించి, వెంటనే కర్నూలు జిల్లా పోలీసులను అప్రమత్తం చేయడంతో డోన్ బస్టాండులో బస్సు దిగగానే చిన్నారులను అక్కడి పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం వారిని సురక్షితంగా అనంతపురానికి తీసుకొచ్చి సీఐ శాంతిలాల్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

బంగారం, నగదు చోరీ

గుత్తి: స్థానిక జెండా వీధిలో నివాసముంటున్న మహబూబ్ బాషా ఇంట్లో చోరీ జరిగింది. పది రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లిన ఆయన బుధవారం ఇంటికి వచ్చాడు. తలుపులు తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి పరిశీలించాడు. బీరువాలోని దుస్తులు చిందరవందరగా పడేసి అందులోని మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.30 వేల నగదును దుండగులు అపహరించినట్లుగా నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గూగూడులో జస్టిస్ నారాయణ నాయక్



నార్పల: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయి స్వామి, ఆంజనేయ స్వాములను బుధవారం తెలంగాణ హైకోర్టు జడ్జి నారాయణ నాయక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జి ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

- దేవదాయశాఖ మాజీ సలహాదారు శ్రీకాంత్



అనంతపురం కార్పొరేషన్: గత ప్రభుత్వంలో బ్రాహ్మణులకు తీరని అన్యాయం జరిగిందని, ఆలయాల్లో విగ్రహాలు కొట్టేశారని, హుండీలు దోచుకున్నారని, తిరుమల లడ్డులో జంతు కొవ్వు కలిపారంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుచ్చి రాంప్రసాద్‌తో కూటమి ప్రభుత్వ పెద్దలు పచ్చి అపద్ధాలు మాట్లాడించారంటూ దేవదాయశాఖ మాజీ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ మండిపడ్డారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014-19 మధ్య కాలంలో హిందూ ధర్మానికి వ్యతిరేకంగా అప్పటి సీఎం చంద్రబాబు నడుచుకున్నారని గుర్తు చేశారు. విజయవాడ దుర్గమ్మ గుడిలో క్షుద్రపూజలు చేసి మహాపరాధానికి పాల్పడ్డారన్నారు. విజయవాడలో 30 ఆలయాలను కూల్చివేశారన్నారు. సదాపర్తి భూములను అనుయాయులకు అప్పగించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత బ్రాహ్మణులకు అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారన్నారు. ఆలయాల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా గత ప్రభుత్వంపై బురద చల్లడం సబబు కాదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: పారిశుధ్యం మెరుగుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సిబ్బందిని నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. బుధవారం కమిషనర్ నగరంలోని రహమత్‌నగర్, కోర్టు రోడ్డు, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. చెత్తను ఎప్పటికప్పుడు కంపోస్టు యార్డుకు తరలించాలని సిబ్బందికి సూచించారు. నగర ప్రజలు సైతం చెత్తను నగర పాలక సంస్థ వాహనాలకు అందించాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించరాదన్నారు. వ్యాపారులు ప్రతి ఒక్కరూ తమ షాపుల ముందు డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకుని నగర శుభ్రతకు సహకరించాలన్నారు.

మార్కెట్‌యార్డులో ఆరుగురు బదిలీ

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆరుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఇక్కడ సూపర్ వైజర్లుగా పనిచేస్తున్న ముగ్గురిలో కేశవ్‌కుమార్ కళ్యాణదుర్గం మార్కెట్ కమిటీకి, నాగేంద్ర కదిరికి, కృపావతి శింగనమల కమిటీకి బదిలీపై వెళుతున్నారు. అలాగే యూడీసీ తిరుపాలు హిందూపురానికి, ఎల్‌డీసీ మల్లిక ధర్మవరం కమిటీకి, క్లర్క్ శైలజాకుమారి హిందూపురం మార్కెట్ కమిటీకి బదిలీ అయినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. వారి స్థానాల్లో మిగతా మార్కెట్ కమిటీల నుంచి ఆరుగురు బదిలీపై ఇక్కడికి వస్తున్నారు.

కార్పొరేట్ విద్యా దందాను అరికట్టాలి

- డీఈఓను కోరిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు


డీఈఓ ప్రసాద్‌బాబుతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న కార్పొరేట్ విద్యా దందాను అరికట్టాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థ కనుమరుగయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కార్పొరేట్ శక్తులకు విద్యావ్యవస్థను తాకట్టు పెట్టేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఒక బ్రాంచ్ కు అనుమతి తీసుకొని 3,4 బ్రాంచ్‌లు నడుపుతున్నాయన్నారు. డీఈఓను కలిసిన వారిలో విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, కార్యదర్శి గంగ శివుడు, నగర కార్యదర్శులు ఫయాజ్, రఫీ, అంజి, కార్తీక్, మహమ్మద్ గౌస్ ఉన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి


మాట్లాడుతున్న అనుపమజేమ్స్

అనంతపురం మెడికల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కుష్టు వ్యాధిగ్రస్తులను ప్రారంభ దశలోనే గుర్తించాలని, తద్వారా వారికి అంగవైకల్యం రాకుండా చూడవచ్చని కుష్టు వ్యాధి విభాగం అధికారి డాక్టర్ అనుపమజేమ్స్ పేర్కొన్నారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. కుష్టు వ్యాధి ఏ దశలో ఉన్నా బహుళ ఔషధ చికిత్సతో 6 నెలలు, 12 నెలల్లో నయమవుతుందన్నారు. ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వైద్యులు డాక్టర్ శివారెడ్డి, పారామెడికల్ అధికారి నాగన్న, హెచ్ఈఓ సత్యనారాయణ, పీటీ రాముడు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

రాప్తాడు: ఉద్యోగులు సమయపాల పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ విజయలక్ష్మి హెచ్చరించారు. 'తెరుచుకోని ఎంపీడీఓ కార్యాలయం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. బుధవారం ఉదయం 9.30 గంటలకే కార్యాలయానికి చేరుకుని సిబ్బంది విధులకు ఎన్ని గంటలకు వస్తున్నారో పరిశీలించారు. ఉదయం పది గంటలకు ఉద్యోగులందరూ విధులకు హాజరు కావాలన్నారు. సమయపాలన పాటించడం లేదని ఫిర్యాదు అందకుండా జాగ్రత్తగా పనిచేసుకోవాలన్నారు.

అధికారుల తీరు.. ప్రజాప్రతినిధుల బేజారు!

బి.యాలేరులో టీడీపీ నేతను కూర్చోబెట్టి వేరుశనగ కాయలను పరిశీలించాలని చూపిస్తున్న వ్యవసాయ సిబ్బంది



- టీడీపీ నేతల ఆధ్వర్యంలోనే వేరుశనగ విత్తన పరిశీలన
- ప్రజా ప్రతినిధులు, రైతులకు సమాచారం ఇవ్వని వైనం

ఆత్మకూరు: సబ్సిడీ విత్తన వేరుశనగ పరిశీలన విషయంలో అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు మండిపడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా ఏటా ప్రభుత్వం సబ్సిడీతో వేరుశనగ కాయలను రైతులకు అందజేస్తుంది. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి రెండు రోజులుగా ఇప్పటికే మండలానికి సబ్సిడీ వేరుశనగ లోడ్‌లు వచ్చాయి. వేరుశనగ విత్తనాలు సరిగా ఉన్నాయా? లేదా ? నాసిరకంగా ఉన్నాయా అన్న విషయాలను వ్యవసాయ అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులతో కలసి వేరుశనగ కాయలను పరిశీలిస్తారు. వేరుశనగ కాయలు బాగుంటే అలాగే ఉంచి బాగోలేకపోతే ఆ లోడ్‌లను వెనక్కి పంపిస్తారు. కాని ఆత్మకూరు మండలంలో మాత్రం దీనికి విరుద్ధంగా జరుగుతోంది.


పంపనూరులో ప్రజా ప్రతినిధులు, రైతులు లేకుండా వేరుశనగ కాయలను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రొటోకాల్ గాలికి..

సబ్సిడీ వేరుశనగ కాయలు ఎలా ఉన్నాయో పరిశీలించడానికి స్థానికంగా ఉన్న సర్పంచ్‌లు కాని, ఎంపీటీసీలకు గాని, రైతులకు గాని ఎలాంటి సమాచారం ఇవ్వలేదని స్థానిక ప్రజా ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. కాని వ్యవసాయ సిబ్బంది మాత్రం రైతు సేవా కేంద్రాలకు టీడీపీ నాయకులను, ప్రజా ప్రతినిధులు కాని వారిని మాత్రం పిలిపించి కుర్చీలు వేసి మరీ కూర్చోబెట్టి వేరుశనగ కాయలు పరిశీలించండి అంటూ చెబుతున్నారు. దీంతో రైతులు, ప్రజా ప్రతినిధులు లేకుండా కేవలం అధికార పార్టీ నేతలతో వేరుశనగ కాయలు పరిశీలించి అవి ఎలా ఉన్నాయో ఇప్పటికీ ఎవరికీ తెలియడంలేదని ప్రజా ప్రతినిధులు, రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లా స్థాయి ఉన్నత అధికారులు స్పందించి విత్తనకాయల పరిశీలనలో ప్రజా ప్రతినిధులు, రైతులకు భాగస్వామ్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

30 కిలోల బస్తా ధర రూ.1674

ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో అందించే ఖరీఫ్ వేరుశనగ కాయలకు సంబంధించి 30 కిలోల బస్తా ధర రూ.1674గా నిర్ణయించినట్లు మండల వ్యవసాయ అధికారి సుచరిత తెలియజేశారు. అర్ధ ఎకరా ఉంటే ఒక బస్తా, ఒక ఎకరాకు పైన ఉంటే మూడు బస్తాలు ఇస్తామన్నారు. మండలానికి 2100 క్వింటాళ్లు మంజూరు కాగా ప్రస్తుతం కే6, ట్యాగ్స్1694 రకాలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

ఎన్టీఆర్ జీవితం ఆదర్శప్రాయం

- కలెక్టర్ వి.వినోద్‌కుమార్


ఎన్టీఆర్ ప్రతిమకు పూలమాల వేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు జీవితం ఆదర్శప్రాయమని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో బుధవారం అధికారికంగా నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల హాజరై ఎన్టీఆర్ ప్రతిమకు పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సినీ రంగంలో ఎన్టీ రామారావు మహోన్నత శిఖరమన్నారు. రాజకీయ రంగంలోనూ గొప్పనేతన్నారు. ముఖ్యమంత్రిగా ప్రజలకు సుపరిపాలన అందించారన్నారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలువురు కవులు, సాహితీవేత్తలు, తదితరులను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్: పీఏబీఆర్ ప్రధాన పైప్‌లైన్‌కు జల్లిపల్లి టోల్‌గేట్ వద్ద లీకేజీ ఏర్పడడంతో ఈ నెల 30, 31న నగరంలో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

ప్రజలపై ఆస్తి పన్ను పెంపు భారం

- సర్వేను అడ్డుకోవాలని సీపీఎం పిలుపు

అనంతపురం అర్బన్: ఆస్తి పన్ను పెంపు ద్వారా ప్రజలపై రూ.16.09 కోట్ల భారాన్ని మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చని కూటమి ప్రభుత్వానికి ప్రజలపై ఆర్థిక భారాలు మోపే నైతిక హక్కు లేదన్నారు. ఆస్తి పన్ను పెంపుతో పట్టణ ప్రజలపై పడనున్న ఆర్థిక భారం వివరాలను బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సీపీఎం నాయకులతో కలసి ఆయన విడుదల చేసి, మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ఆస్తి పన్ను పెంచం, విద్యుత్ చార్జీలు పెంచం, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయం, సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తాం... కూటమిని గెలిపించాలంటూ చంద్రబాబు అండ్ కో కోరారని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన తర్వాత కేంద్రంలోని కూటమి ప్రభుత్వానికి సాగిలపడి ప్రజలపై భారాలు వేసే చట్టాలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని 123 పట్టణ ప్రాంతాల్లో రూ.463 కోట్ల మేర ఆస్తి పన్ను పెంపునకు ఈ నెల 14న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ లెక్కన అనంతపురం నగరంలో రూ.9.81 కోట్లు, గుంతకల్లు పట్టణంలో రూ.2.14 కోట్లు, తాడిపత్రిలో రూ.1.79 కోట్లు, రాయదుర్గంలో రూ.82.96 లక్షలు, గుత్తిలో 80.43 లక్షలు, కళ్యాణదుర్గంలో రూ.72.05 లక్షలు చొప్పన మొత్తం రూ.16.09 కోట్ల అదనపు ఆర్థిక భారం మోపేలా ఇంటింటి సర్వేలను నిర్వహించనుందన్నారు. కొత్తగా ఆస్తి పన్ను నిర్ధారించేందుకు ఉద్దేశించిన సర్వేలను పట్టణ ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, రామిరెడ్డి, నాయకులు నాగమణి, వెంకటనారాయణ, ముత్తుజా, గోపాల్, వలి, మసూద్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.


పట్టణాల్లో పెరగనున్న ఆస్తి పన్ను వివరాలను విడుదల చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, నాయకులు

ఎన్టీఆర్ చిరస్మరణీయుడు

అనంతపురం కల్చరల్: తెలుగు సినీ పరిశ్రమలోనే కాకుండా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన నందమూరి తారకరామారావు చిరస్మరణీయులని పలువురు వక్తలన్నారు. ఐదురోజులుగా సాగుతున్న నాటకోత్సవాలు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా బుధవారం రాత్రి ఘనంగా ముగిశాయి. దక్షిణభారత సాంస్కృతిక మండలి మాజీ సభ్యుడు మైఖేల్ బాబు నేతృత్వంలో అనంత నాగ్ సంగీత్ స్వర్గ కల్చరల్ అసోసియేషన్ వారు స్థానిక కృష్ణకళామందిరంలో సంగీత విభావరి నిర్వహించారు. నిర్వాహకులు నాగిన్ ప్రసాద్‌తో పాటు డీఆర్వో మలోల తదితరులు ఎన్టీఆర్ సినిమాలలోని పాటలను ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా అనంత రంగస్థలానికి విశేష కృషి చేసిన 15 మంది కళాకారులను ఎన్టీఆర్ స్మారక అవార్డులతో సత్కరించారు.

- ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా జిల్లా కళాకారులు ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయ భవన్, అనంతపురం క్లబ్, రెండో రోడ్డులోని మహతి శిక్షణాలయంలో సీనియర్ గాయకులు ఎన్టీఆర్‌కు కళానీరాజనాలు పట్టారు.


ఎన్టీఆర్ అవార్డులను అందుకుంటున్న కళాకారులు

ఆకాశవాణి సీనియర్ వ్యాఖ్యాత డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, ఆచార్య సుధాకరబాబు, సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ, పాలసముద్రం నాగరాజు, కేవీ మహీధర్, సురేష్‌బాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు ఎన్టీఆర్

రాప్తాడు: మాజీ సీఎం ఎన్టీఆర్ ఆదర్శప్రాయుడని ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

టీకాలు వేయించండి


చిన్నారి బరువు చూస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: రెండేళ్లలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయించాలని సీహెచ్ఓ చంద్రకళ తెలిపారు. బుధవారం హంపాపురంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి బుధవారం, శనివారం టీకాలు వేస్తామని తెలిపారు. వ్యాక్సిన్ వేయించుకోని వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పుష్పలత, ఆశా కార్యకర్తలు శ్రావణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి పరిశీలన

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ అందేలా విత్తనశుద్ధి చేపట్టాలని ఏవోలు జే.శశికళ, శ్రీనాథ్‌రెడ్డి నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం స్థానికంగా ఉన్న జశ్వంత్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న విత్తనశుద్ధి కార్యక్రమాన్ని పరిశీలించి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అని ప్రయోగాత్మకంగా చూశారు. అలాగే మొలకశాతానికి సంబంధించి ఏర్పాటు చేసిన ట్రేలను పరిశీలించారు. ఏవోల వెంట ఏఈవో మురళీక్రిష్ణ, వీహెచ్ఏ పావణి, నిర్వాహకులు రమణ తదితరులు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తికి గాయాలు

పెద్దపప్పూరు: విద్యుత్ స్తంభాల మీదుగా లాగిన టీవీ కేబుల్‌కు విద్యుత్ సరఫరా కావడంతో వెంకటరమణ అనే యువకుడు గాయాల పాలయ్యాడు. వివరాలు.. మండలంలోని చాగల్లు గ్రామానికి చెందిన వెంకటరమణ పశుసంవర్ధక శాఖలో గోపాలమిత్రగా పని చేస్తున్నాడు. బుధవారం తన పని ముగించుకుని పొలానికి బయలుదేరాడు. చాగల్లు–పెద్దపప్పూరు రోడ్డు మార్గంలోని గోదాం వద్ద టీవీ కేబుల్ తలకు అందే ఎత్తులో ఉండటంతో తొలుత ఆ కేబుల్‌ను దాటుకుని వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ కేబుల్‌కు సపోర్ట్‌గా ఏర్పాటు చేసిన ఇనుప తీగకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనలో వెంకటరమణ చేతులకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ నరసింహులును సంప్రదించగా.. టీవీ కేబుల్‌కు సపోర్ట్‌గా ఏర్పాటు చేసిన ఇనుప తీగకు విద్యుత్ సరఫరా కావడం వల్లే ఈ ఘటన జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అదృష్టవశాత్తూ వెంకటరమణ ప్రాణాలతో బయటపడ్డాడని గ్రామస్తులు పేర్కొన్నారు.


చికిత్స పొందుతున్న వెంకటరమణ

సీనియారిటీ జాబితాలో తప్పులను సవరించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల సీనియారిటీ జాబితాలో తప్పులను సవరించాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులలో భాగంగా అనంతపురం జిల్లా ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల సీనియారిటీ జాబితాలో అనేక తప్పిదాలు జరిగాయన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా..ఇప్పటిదాకా సవరణలు జరగలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని తప్పులను సవరించాలని డిమాండ్ చేశారు. డీఈఓను కలసిన వారిలో పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీరాములు, హరి ప్రసాద్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.


డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

రేపు నరసింహ స్వామి కల్యాణం

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన నవ అహోబిల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఈనెల 30న శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో వేకువజాము నుంచి స్వామికి అభిషేకాలు, అర్చనలు, మండల పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకోవాలని సూచించారు.


అలంకరణలో నవ అహోబిల నరసింహుడు

మహిళపై కుటుంబ సభ్యుల దాడి

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌కు చెందిన బాలన్న భార్య గాలి మేరీపై ఆమె పెద్ద కుమారుడు జ్యాకిమ్, కోడలు లత దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపిన మేరకు... బాలన్న, గాలి మేరీ దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రులు చిన్మయనగర్‌లో నివాసం ఉంటుండగా, పెద్ద కుమారుడు జ్యాకిమ్, అతని భార్య లత ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్నారు. అమ్మమ్మకు చెందిన ఆస్తి విషయంలో ఈ నెల 26న తల్లితో జ్యాకిమ్ గొడవపడ్డాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో జ్యాకిమ్, లత చేతికి అందుబాటులో ఉన్న రీపర్ తీసుకుని మేరీపై దాడి చేశారు. తలకు తీవ్ర గాయమై 18 కుట్లు పడ్డాయి. ఘటన జరిగిన రోజు తలకు తగిలిన గాయం వల్ల ఏమీ జరిగిందో ఆమె పోలీసులకు చెప్పలేకపోయింది. బుధవారం ఆరోగ్యం కుదుటపడడంతో జరిగిన ఘటన వివరిస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


తీవ్రంగా గాయపడిన మేరీ

యువతి అదృశ్యం

అనంతపురం: నగరంలోని విద్యుత్ నగర్‌కు చెందిన 20 ఏళ్ల యువతి బుధవారం రాత్రి అదృశ్యమైంది. ఈ మేరకు తండ్రి స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796806, 9849427254 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

హంద్రీ– నీవా లైనింగ్ పనులు వెంటనే ఆపాలి

- వైఎస్సార్‌సీపీ నాయకుల డిమాండ్

రాప్తాడు: హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులతో రైతులకు తీరని నష్టం కలుగుతుందని, తక్షణమే ఆ పనులు నిలుపుదల చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. హంద్రీ నీవా కాలువ లైనింగ్ పనులను ఆపాలనే డిమాండ్‌తో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆత్మకూరు, రాప్తాడు, కనగానపల్లిలో చేపట్టే రిలే దీక్షలకు పోలీసుల అనుమతి కోసం రెండు రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు వైఎస్సార్ కడప జిల్లాలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో బిజీగా ఉండడంతో బుధవారం రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ మహబూబ్ పీరాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అనంతపురం రూరల్ జెడ్పీటీసీ చంద్రకుమార్, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, పార్టీ రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండల కన్వీనర్లు సాకే వెంకటేష్, బాల పోతన్న, బండి పవన్ కుమార్, రాప్తాడు, ఆత్మకూరు మండల యూత్ విభాగం కన్వీనర్లు విశ్వనాథ్‌రెడ్డి, గూలి కొండారెడ్డి విలేకరులతో మాట్లాడారు. హంద్రీ– నీవా కాలువను 6,300 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాల్సి ఉందన్నారు. ఆ మేరకు గత ప్రభుత్వంలో ప్రారంభించిన పనులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. హంద్రీ– నీవా నుంచి నీటిని చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాలకు ఇవ్వాల్సిన అవసరం లేకుండా గండికొట నుంచి వేరొక కాలువ నిర్మాణం ద్వారా ఇచ్చేందుకు నాడు పనులు ప్రారంభిస్తే వాటినీ నిలిపివేశారన్నారు. 83 టీఎంసీలు అవసరం ఉన్న చోట 40 టీఎంసీల మాత్రమే తీసుకువచ్చే పరిస్థితి కల్పించడంతో రైతులు భవిష్యత్‌లో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. పిల్ల కాలువలు నిర్మించకుండా కాలువ లైనింగ్ చేస్తే భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదముందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసే ఉద్దేశంతోనే ఆందోళన చేపట్టాలనుకున్నట్లు చెప్పారు. చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాలకు గండి కోట నుంచే 20 టీఎంసీల నీరు ఇవ్వాలనేదే ప్రధానమైన డిమాండ్ అని అన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాలకు మాత్రమే 63 టీఎంసీల హంద్రీ– నీవాను పరిమితం చేయాలన్నారు. పిల్ల కాలువలు ఏర్పాటు చేసి ప్రతి ఎకరాకూ సాగునీరు ఇవ్వాలన్నారు. వెంటనే లైనింగ్ పనులు నిలుపుదల చేయాలని రాప్తాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, రైతు సంఘాల నాయకులతో కలిసి రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. లైనింగ్ పనులు ఆపకపోతే ఆమరణ దీక్షలు చేసేందుకూ వెనుకాడబోమని హెచ్చరించారు. నిరాహార దీక్ష తేదీ ఎప్పుడనేది త్వరలో ప్రకటిస్తామన్నారు. పోలీసులు అనుమతులు ఇచ్చినా, ఇవ్వకున్నా ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఇంటి వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడుతామని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ కన్వీనర్ జూటూరు శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు బుడగ నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, నారాయణ రెడ్డి, నాగరాజు, బ్రహ్మానందరెడ్డి, నాగేంద్ర, పుల్లారెడ్డి, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.


ఏఎస్ఐకి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రైళ్ల కింద పడి ఇద్దరి ఆత్మహత్య

అనంతపురం సిటీ: స్థానిక జీఆర్పీ పరిధిలో వేర్వేరు రైళ్ల కిందపడి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... కల్లూరు–గార్లదిన్నె రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి(40) ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు బుధవారం అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఐదు అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు, లైట్ నీలం రంగు, తెలుపు రంగు లైన్స్ కలిగిన ఫుల్‌షర్ట్, ఎరువు రంగు కట్ బనియన్, పాచి కలర్ ఫుల్ అండర్ వేర్, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నట్లుగా గుర్తించారు. అలాగే అనంతపురం–ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ల మధ్య మరో యువకుడు (25) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు, నలుపు రంగు కార్గో జీన్స్ దానిపై డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఫ్యాషన్స్ అని ఆంగ్ల అక్షరాల్లో లేబుల్ ఉన్నట్లు తెలిపారు. ఎరుపు రంగు బనియన్ ధరించి ఉన్నాడన్నారు. ఇద్దరూ వేర్వేరు రైళ్ల కిందపడి ఆత్మహత్య చేసుకున్నారని, ఇందుకు గల కారణాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. మృతుల ఆచూకీ తెలిసిన వారు 79895 84613కు సమాచారం అందించాలని కోరారు.

4 నుంచి దశమ బ్రహ్మోత్సవాలు


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: తపోవనంలో కొలువుదీరిన శ్రీక్షేత్రం దశమ బ్రహ్మోత్సవ వేడుకలు వచ్చే నెల 4 నుంచి 6 వరకు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ప్రభుత్వ మాజీ సలహాదారు (ఎండోమెంటు) జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. వేడుకల పోస్టర్లను బుధవారం రాత్రి ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ 4న ధ్వజారోహణం, దివ్యప్రబంధ పారాయణం, నవకలశ స్నాపనం, సుదర్శన హోమం, దీపోత్సవం, 5న శ్రీవారి కల్యాణోత్సవం, గరుడోత్సవం, నగరోత్సవాలు, 6న ధ్వజ అవరోహణం, వసంతోత్సవం, నిరాటోత్సవంతో పాటు ద్వాదశ కలశారాధన జరుగుతాయన్నారు. భక్తులందరూ పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. శ్రీలక్ష్మీ హయగ్రీవ శ్రీవేంకటేశ్వర, శ్రీగోదారంగనాథస్వామి ఆలయంలో ఏటా బ్రహ్మోత్సవాలను జిల్లా శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీక్షేత్రం ప్రతినిధులు అంబాళం రఘు, రవి, రాఘవేంద్రాచార్ తదితరులు పాల్గొన్నారు.